సాక్షి హనుమకొండ

గురువారం । 6 । మార్చి । 2025



డిగ్రీ ఫలితాలు నిలిపివేత

కేయూ అకడమిక్ డీన్‌కు ఫీజు చెల్లించకపోవడంతో 121 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల పరీక్ష ఫలితాలను అధికారులు నిలిపివేశారు.

- 8లో▸



నకిలీ పురుగు మందు విక్రేతల అరెస్ట్

నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్న ముఠాను బుధవారం అరెస్టు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం $34^0/17^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండతోపాటు ఉక్కపోత ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

ఇఫ్తార్ గురు 6:29 | సహర్ శుక్ర 5:08

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

'వేసవి'కి ముందస్తుగా సిద్ధంగా ఉండాలి



ధర్మసాగర్/వేలేరు : రానున్న వేసవి కాలంలో వచ్చే వేడిగాలులు, వడదెబ్బల నివారణకు వైద్యాధికారులు ముందస్తుగా ప్రణాళికలు తయారు చేసుకొని సిద్ధంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. బుధవారం జిల్లాలోని నారాయణగిరి, ఎర్రబెల్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు, ధర్మసాగర్, వేలేరుల్లోని పీహెచ్‌సీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, వేసవిలో వేడిగాలులు, వడదెబ్బలపై ముందస్తు ప్రణాళికలను తెలుసుకొని పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన ముప్పారంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని సందర్శించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ, నిల్వ ప్రక్రియ గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ గోపినాథ్, డాక్టర్ మేఘన, సూపర్‌వైజర్లు రామ్మోహన్, కుమారస్వామి, నర్సులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అకుట్ అధ్యక్షుడిగా ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (అకుట్) అధ్యక్షుడిగా ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా మ్యాథమెటిక్స్‌విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈనెల 4న జరిగిన ఎన్నికల్లో 75 మంది అధ్యాపకులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం లెక్కింపు ప్రక్రియ నిర్వహించగా ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డికి 41 ఓట్లు, మల్లికార్జున్‌రెడ్డికి 32 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లలేదు. 8ఓట్లతో వెంకట్రామ్‌రెడ్డి విజయం సాధించారు. జనరల్ సెక్రటరీ పదవికి డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌కు 46 ఓట్లు, పి.శ్రీనివాస్‌కు 29 ఓట్లు వచ్చాయి. 17 ఓట్లతో రాజ్‌కుమార్ విజయం సాధించారు. విజయం సాధించిన ఇద్దరికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణపత్రాలు అందించారు. ఇప్పటికే ఉపాధ్యక్షురాలిగా ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న, జాయింట్ సెక్రటరీగా వి.రాము, ట్రెజరర్‌గా డాక్టర్ డి.రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గసభ్యులుగా ఎ.స్వర్ణలత, పి.వెంకటయ్య, షాయెదా , కె.సుమలత, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.జ్యోతి, పి.వరలక్ష్మి, ఇ.హరికృష్ణ ఎన్నికయ్యారు.

బ్రిడ్జి విస్తరణకు నిధులు కేటాయించండి

హసన్‌పర్తి: హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారిలోని చింతగట్టు బ్రిడ్జి విస్తరణకు నిధులు కేటాయించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు బుధవారం భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. 40ఏళ్ల క్రితం ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారని, పలుచోట్ల దెబ్బతిన్నదని, వాహనాలరద్దీకి అనుగుణంగా విస్తరించాల్సి ఉందని పేర్కొన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే వెంట కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

వేయిస్తంభాల దేవాలయ ఆదాయం రూ. 22,01,850

హన్మకొండ కల్చరల్ : నగరంలోని వేయిస్తంభాల దేవాలయంలో బుధవారం ఉదయం ఫిబ్రవరి 25వతేదీ నుంచి మార్చి ఒకటి వరకు జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీ ఆదాయం రూ.8,21,800, పూజా రుసుముల ద్వారా రూ.7,20,000, విరాళాలు రూ.6,60,000 మొత్తం ఆదాయం రూ. 22,01,800 వచ్చినట్లు ఈఓ అనిల్‌కుమార్ తెలిపారు.

ఆక్సిజన్.. అస్తవ్యస్తం



ఎంజీఎంలో రోగులకు సరిగ్గా అందని ఊపిరి

- ప్రభుత్వ ఖజానా దుర్వినియోగం
- మరమ్మతుల లోపం.. నిర్వహణలో నిర్లక్ష్యం

అత్యవసర సమయాల్లో రోగికి అందించే ఆక్సిజన్ ఎంజీఎంలో సరిగ్గా అందట్లేదు. పైపులు గోడలకు వేలాడుతున్నా.. పట్టించుకునేవారు లేరు. కొందరు నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ ఖజానా దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎంజీఎంకు వచ్చే పేద రోగులకు ఎంత మేర ఆక్సిజన్ అందుతుందో తెలియదు. అడిగేవారూ లేరు. ఫలితంగా కొందరు అధికారులు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు.

- ఎంజీఎం

ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యుల గైర్హాజరు, సమయపాలన పాటించకపోవడం రోగులకు ఓ సమస్య అయితే.. రోగులకు ప్రాణం పోసే ఆక్సిజన్ సరఫరాలో నిర్లక్ష్యం వహించడం మరో అవస్థ. ఆస్పత్రిలో పాలనాధికారులు, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సమస్యల్ని పట్టించుకోకపోవడం పేద ప్రజలకు శాపంగా మారింది. వరంగల్ కలెక్టర్ సత్యశారద కొన్ని నెలల క్రితం వరుసగా ఎంజీఎం ఆస్పత్రిని సందర్శించి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి ఆదేశాల మేరకు కొన్ని సమస్యలు పరిష్కరించేందుకు ఫిర్యాదుల పెట్టె, నిత్యం సమీక్షలు జరిపారు. ఓపీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తామన్నారు. కానీ అత్యవసర సేవల్లో ఏ మాత్రం మార్పు లేదు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వైద్యులు, వైద్యసిబ్బందిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోగులకు ప్రాణాలు పోసే ఆక్సిజన్ వంటి సరఫరా వ్యవస్థలు మరమ్మతులకు నోచుకోవట్లేదు. దీంతోపాటు ఆస్పత్రిలో ఎక్కడ చూసినా సమస్యలు దర్శనమిస్తున్నాయి. వామ్మో ఎంజీఎం ఆస్పత్రి అనేలా ఆస్పత్రి పాలన తయారైందన్న ఆరోపణలున్నాయి.

అత్యవసరమా.. అంతే సంగతి!

నిత్యం పదుల సంఖ్యలో ప్రాణాపాయస్థితిలో ఎంజీఎంకు బాధితులు వస్తుంటారు. వెంటిలేటర్‌తో పాటు ఆక్సిజన్ పడకలపై చికిత్స పొందుతుంటారు. శోకసంద్రంలో మునిగిపోతుంటారు.

సరైన మోతాదులో అందని ప్రాణవాయువు

ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ప్రాణం పోసేందుకు ఎంజీఎం ఆస్పత్రిలోని ఏఎంసీ, ఐఎంసీ, క్యాజువాలిటీ, ఐసీఎస్‌యూ, ఆర్ఐసీయూ వంటి వార్డులు చాలా కీలకం. ఇలాంటి వార్డులను నిత్యం పర్యవేక్షిస్తూ వైద్యులున్నారా? ఎలాంటి ఔషధాలు అందుబాటులో ఉన్నాయి? ఆక్సిజన్ సరఫరా ఎలా ఉంది? డ్యూటీ వైద్యులు వస్తున్నారా? అనే విషయాలను ఆర్ఎంఓలు, సూపరింటిండెంట్లు నిత్యం పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.



తుప్పు పట్టిన ఆక్సిజన్ పైపులైన్



ఆస్పత్రిలో గోడకు వేలాడుతున్న ఆక్సిజన్ పైపులైన్

ప్రాణాలు పోసే ఏఎంసీ, ఐఏఎంసీ వంటి వార్డులకు ఆక్సిజన్ సరఫరా చేసే పైపులైన్ ఏర్పాటు చేసి 15 నుంచి 20 ఏళ్లు గడుస్తున్న క్రమంలో కనీసం వాటికి మరమ్మతులు చేపట్టకపోవడం వల్ల రోగికి అందాల్సిన ఆక్సిజన్ సరైన మోతాదులో అందని పరిస్థితి. ఓ క్రమ పద్ధతిలో ఉండాల్సిన ఆక్సిజన్ పైపులైన్ల నిర్వహణలో గోడకు వేలాడుతూ.. తీగలపై ఆధారపడి ఉండడమే ఇందుకు నిదర్శనం.

వృథా.. వ్యథ!

ఆక్సిజన్ సరఫరాలో ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో రోగికి ప్రాణవాయివు అందకపోవడం ఓ





సమస్య అయితే.. వాడాల్సిన పరికరాలు (ఆక్సిజన్ ప్రెజర్ రెగ్యులేటర్స్) వాడకపోవడం వల్ల ఎక్కువ ఆక్సిజన్ వాడకం వల్ల ప్రజాధనం దుర్వినియోగమవుతోందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ల వద్ద నిర్వహణ సరిగ్గా లేక ప్రతీరోజు 500 నుంచి 600 పాయింట్స్ మాత్రమే వాడాలి. కానీ ప్రస్తుతం 900 నుంచి 1,100 పాయింట్స్ వినియోగిస్తున్నారు. అయితే దీని ద్వారా ఎవరైతే టెండర్‌లో ఆక్సిజన్ సరఫరా చేస్తున్నారో సదరు కాంట్రాక్టర్ ధనార్జన సాగేందుకు ఆస్పత్రి సిబ్బంది మరమ్మతులు చేయకుండా, పరికరాలు అందించకుండా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.



కోటలో విదేశీయులు..

ఖిలావరంగల్ మధ్యకోటను బుధవారం పోలాండ్, అమెరికా దేశస్తులు వేర్వేరుగా సందర్శించారు. శిల్ప కళా సంపదను తిలకించారు. ఖుష్‌మహల్, ఏకశిలగుట్ట, రాతి, మట్టికోట అందాలను వీక్షించారు. అక్కడికి వచ్చిన విద్యార్థులతో సెల్ఫీలు దిగారు. కాకతీయుల విశిష్టతను టూరిజం ప్రమోషన్ అధికారి కుసుమ సూర్యకిరణ్ విదేశీయులకు వివరించారు. - ఖిలా వరంగల్

సామాజికవర్గ స్థాయిలో కేసులు పరిష్కారం కావాలి

- వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

వరంగల్ లీగల్: సామాజికవర్గ స్థాయిలోనే కేసులు పరిష్కారమైతే కుటుంబం, సమాజానికి మేలు కలుగుతుందని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలాగీతాంబ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సదన్ బిల్డింగ్‌లో వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీస్‌స్టేషన్లు, కోర్టుల దాకా వివాదాలు తీసుకెళ్తే వ్యక్తుల మధ్య సంబంధాలు దెబ్బతింటాయని, ఇది సమాజానికి హానికరమన్నారు. ఈ విషయంలో సామాజికవర్గాల పెద్దలు పోషించాల్సిన పాత్ర గురించి చర్చించడానికి ఈనెల 15న రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ హనుమకొండకు రానున్నారని తెలిపారు. ఉదయం 9 గంటలకు హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని సామాజికవర్గాల కమ్యూనిటీ మీడియేటర్లు హాజరు కావాలని కోరారు. సమావేశంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, ఎం.రమేశ్‌బాబు, వివిధ సామాజిక వర్గాల కమ్యూనిటీ మీడియేటర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ

అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కోరారు. 8, 10వ డివిజన్ల పరిధిలోని హనుమకొండ చౌరస్తా, టైలర్ స్ట్రీట్, ఇందిరానగర్, రాయపుర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేస్తానని అన్నారు. చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య, టైలర్స్ స్ట్రీట్, ఇందిరానగర్‌లో డ్రైనేజీ సమస్యల పరిష్కారంతో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. రాయపురలో నిర్మాణంలో ఉన్న డ్రైయిన్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



రాయపురలో డ్రైయిన్ బాక్స్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

కేడీసీలో నేటినుంచి అంతర్జాతీయ సదస్సు

- రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ శ్రీదేవసేన రాక
- కెన్యా ప్రొఫెసర్ కీలకోపన్యాసం
- 150 పరిశోధనాపత్రాల సమర్పణ

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కేడీసీ) ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో అంతర్జాతీయ సదస్సు ఉంటుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజారెడ్డి, సదస్సు కన్వీనర్ అండ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రాంభాస్కర్‌రాజు బుధవారం తెలిపారు. 'ట్రాన్స్‌ఫర్మేషన్స్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ ఇన్ మల్టీడిసిప్లినరీ కాంటెక్స్' ఇన్ ది కరెంట్ ఎరా' అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చీఫ్ ప్యాట్రన్‌గా రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ ఎ.శ్రీదేవసేన (ఐఏఎస్) కో ప్యాట్రన్స్‌గా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి, సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరాంవెంకటేష్ గౌరవ అతిథిగా కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం, ఆర్ట్స్ డీన్ టి.మనోహర్, ఇతర అతిథులు హాజరుకానున్నారు. కెన్యానుంచి ప్రొఫెసర్ జి.కుప్పురం కీలకోపన్యాసం చేయనున్నారు. బంగ్లాదేశ్ నుంచి డాక్టర్ షేక్ మెహది హాసన్, హైదరాబాద్ చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వీసీ జి.దామోదర్ పాల్గొంటారు. సదస్సులో వివిధ రాష్ట్రాలు, విదేశాలనుంచి 150 పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు. కేడీసీ చరిత్రలో తొలిసారిగా అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజారెడ్డి తెలిపారు.

'రాయపర్తి' కేసులో పురోగతి అంతంతే..

- పోలీసులకు సవాల్‌గా ఎస్‌బీఐ గోల్డ్ చోరీ ఘటన
- మూడు నెలలు దాటినా బంగారం రికవరీ నామమాత్రమే



రాయపర్తిలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్

సాక్షి, వరంగల్: రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో భారీ చోరీ జరిగి మూడు నెలలు దాటింది. సుమారు 496 మంది ఖాతాదారులకు సంబంధించి రూ.12.95 కోట్ల విలువ చేసే 19 కిలోల బంగారం అపహరణకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికీ ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, కొంత బంగారం రికవరీ చేశారు. 2024 నవంబర్ 19న ఈ చోరీ జరగగా.. తమ బంగారం ఇవ్వాలని బాధితులు ఆ బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారు. రేపు, మాపు అంటూ అధికారుల నుంచి సమాధానం వస్తుండడంతో ఎస్‌బీఐ ఎదుట వినియోగదారులు బుధవారం ఆందోళనకు దిగారు.

మిగిలిన నిందితులు చిక్కితేనే..

ఈ భారీ చోరీ కేసులో రికవరీ పోలీసులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. యూపీలోని బదౌన్ జిల్లా కక్రాల గ్రామంలోకి ప్రాణాలకు తెగించి వెళ్లిన వరంగల్ పోలీసులకు గతేడాది డిసెంబర్‌లో ప్రధాన నిందితుడు మహమ్మద్ నవాబ్‌హసన్ మాత్రమే దొరికాడు. గ్యాస్ కట్టర్ వృత్తిలో నైపుణ్యమున్న అతడి తమ్ముడు సాజిద్‌ఖాన్ జాడ తెలియలేదు. తన వద్ద ఏం లేదని, తమ్ముడి వద్ద 10 కిలోల 480 గ్రాముల బంగారం ఉందని హసన్ చెప్పడంతో పోలీసులు అతడి కదలికలపై నిఘా ఉంచారు. ఇప్పటికే అర్షద్ అన్సారీ, షాఖీర్‌ఖాన్ అలియాస్ బొలేఖాన్, హిమాన్షు బికాం చంద్ జాన్వర్‌ను డిసెంబర్ 6న పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 2 కిలోల 520 గ్రాముల బంగారం మాత్రమే స్వాధీనం చేసుకోగలిగారు. మిగిలిన 16 కిలోల 480 గ్రాముల బంగారంలో 6 కిలోలు మహారాష్ట్రకు చెందిన సాగర్ భాస్కర్ గోర్, అక్షయ్ గజానన్ అంబోర్ వద్ద ఉందని, సాజిద్‌ఖాన్ వద్ద 10 కిలోల 480 గ్రాముల బంగారం ఉందని నిందితులు పోలీసులకు చెప్పారు. దీంతో వారిని పట్టుకునేందుకు శ్రమిస్తున్నారు. రెండు నెలల నుంచి కేసులో పెద్దగా పురోగతి లేదు. ఈ కేసు విషయమై వర్ధన్నపేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఈ కేసులో మిగిలిన నిందితులను సాధ్యమైనంత తొందరగా పట్టుకొని చార్జిషీట్ వేస్తామని తెలిపారు.

మా బంగారం ఇవ్వండి
రాయపర్తి ఎస్‌బీఐలో బాధితుల ఆందోళన

- 8లో▸

దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్: హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)లో మూడు సంవత్సరాల చేనేత, టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ వరంగల్ జిల్లా సహాయ సంచాలకులు రాఘవరావు ఒక ప్రకటనలో కోరారు. 60 సీట్లు ఉన్న కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి పదో తరగతి ఉత్తీర్ణులై, జూలై 1 నాటికి బీసీ, ఓసీలు 23, ఎస్సీ, ఎస్టీలు 25 ఏళ్లు ఉండాలన్నారు. వివరాలకు ఓఎస్‌డీ హిమజాకుమార్ 90300 79242 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఇంటర్ ప్రథమ పరీక్షలు ప్రారంభం





వరంగల్ ఏవీవీ కళాశాల కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు, హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

- హనుమకొండ జిల్లాలో 673 మంది, వరంగల్‌లో 267మంది గైర్హాజరు
- పలు కేంద్రాలను తనిఖీ చేసిన సీపీ, అడిషనల్ కలెక్టర్, విద్యాశాఖ అధికారులు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ పరీక్షలు బుధవారం షురూ అయ్యాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల రాకతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. జిల్లాలోని 55 కేంద్రాల్లో ఫస్టియర్ పరీక్షలు నిర్వహించారు. ఉదయమే 8-30గంటల వరకే ఎక్కువశాతంమంది విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోగా, తనిఖీ చేసి లోనికి అనుమతించారు. 5 నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చిన వారిని కూడా అనుమతించారు. మొదటిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు జరిగాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల జరిగిన పరీక్షల్లో జనరల్ విభాగంలో 19,412మంది విద్యార్థులకు 18,815మంది హాజరుకాగా 596మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1,134మందికిగాను 1,057మంది హాజరుకాగా 77 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 20,546 మంది విద్యార్థులకుగాను 19,872మంది హాజరుకాగా, 673మంది గైర్హాజరాయ్యారని డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు. హనుమకొండ అడిషనల్ కలెక్టర్ ఎ.వెంకటరెడ్డి వడ్డేపల్లిలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీ, నారాయణ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లోని ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. డీఐఈఓ గోపాల్ కూడా పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. హనుమకొండలోని కో ఎడ్యుకేషన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఓ ప్రైవేట్ కాలేజీ విద్యార్థి కాపీయింగ్ చేస్తుండగా హైదరాబాద్ ఇంటర్‌బోర్డు నుంచి వచ్చిన ఇద్దరు అబ్జర్వర్లు పట్టుకొని డీబార్ చేసినట్లు డీఐఈఓ గోపాల్ తెలిపారు.

వరంగల్ జిల్లాలో

కాశోజీ సెంటర్: వరంగల్ జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సరం పరీక్షకు 5,372 మంది జనరల్ విద్యార్థులకు 5,175 మంది హాజరు కాగా.. 197 మంది గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ తెలిపారు. 894 మంది ఒకేషనల్ విద్యార్థులకు 824 మంది హాజరుకాగా.. 70 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. వరంగల్ ఎల్‌బీ కళాశాల కేంద్రంలో సంస్కృతం పరీక్ష రాస్తున్న ఒక విద్యార్థిపై మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎల్‌బీ కళాశాల సెంటర్‌ను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఏసీపీ నందిరాంనాయక్, ఇన్‌స్పెక్టర్ గోపితో కలిసి పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు.



ఆల్‌ది బెస్ట్ : హనుమకొండలో కూతురికి గుడ్‌లక్ చెబుతున్న తల్లిదండ్రులు, సోదరి



వరంగల్ ఏవీవీ కళాశాల కేంద్రానికి వాకర్ సాయంతో వస్తున్న ఓ విద్యార్థి

పోలీసుల సాయం..



మడికొండ: కాజీపేటలోని క్షేత్ర కళాశాలలో సెంటర్ పడిన ఓ విద్యార్థి.. మడికొండ మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలకు వచ్చాడు. పరీక్షకేంద్రం తెలియకపోవడం, అప్పటికే సమయం మించిపోవడంతో కంగారుపడుతుండగా గమనించిన మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ వెంటనే స్పందించారు. హెడ్ కానిస్టేబుల్ రాంచందర్‌ను పురమాయించి ద్విచక్ర వాహనంపై ఆ విద్యార్థిని సకాలంలో సరైన సెంటర్ చేర్చాడు. పోలీసులు చేసిన సాయానికి ఆ విద్యార్థి కృతజ్ఞతలు తెలిపాడు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్

27మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య పీజీ పరీక్షలు, రెగ్యులర్ ఎల్ఎల్‌బీ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం విద్యాకళాశాల కేంద్రంలో పీజీ పరీక్షల్లో కాపీయింగ్ చేస్తూ 16మంది విద్యార్థులు పట్టుబడగా డీబార్ చేశారు. అదే విధంగా వరంగల్ సీకేఎం కాలేజీ కేంద్రంలో 10మంది, ఎల్‌బీ కాలేజీలో ఒకరు కాపీయింగ్ చేస్తుండగా స్క్వాడ్ పట్టుకొని డీబార్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ తెలిపారు. పరీక్షల నిర్వహణ తీరును అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య, డాక్టర్ పద్మజ పర్యవేక్షించారు. వీరివెంట డాక్టర్ ఆర్.మేఘనరావు ఉన్నారు.

'ఎల్‌ఆర్‌ఎస్' పరిశీలనలో వేగం పెంచాలి

● బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్ : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనంలో పురోగతి అవసరమని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన పురోగతిపై బుధవారం ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం కోసం బల్దియా ప్రధాన కార్యాలయంతో పాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని సీపీని ఆదేశించారు. వార్డు ఆఫీసర్లు రోజూ 50 దరఖాస్తులు పరిశీలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌ఆర్ ఎస్ పై అవగాహన కోసం సర్వేయర్ల సేవలు వినియోగించుకోవాలన్నారు. ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత..

హనుమకొండ హంటర్ రోడ్డులోని అక్రమ కట్టడాలను టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చివేశారు. నంబూరి చారుమతికి చెందిన 2వేల గజాల అక్రమ నిర్మాణాలు నేలమట్టం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

అజ్నీ ప్యాసింజర్ పునరుద్ధరణ..

నేటి నుంచి పట్టాలెక్కనున్న రైలు | కాజీపేట-బల్హార్షా ఎక్స్‌ప్రెస్‌గా మార్పు

కాజీపేట రూరల్ : కరోనా సమయంలో రద్దు చేసిన అజ్నీ ప్యాసింజర్‌ను పునరుద్ధరించారు. గురువారం నుంచి యథావిధిగా నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. ఈ నెల 6నుంచి కాజీపేట జంక్షన్ నుంచి ప్రతీ రోజు రాత్రి 10.50 గంటలకు బయలుదేరే కాజీపేట-బల్హార్షా (17035) ఎక్స్‌ప్రెస్ ఉదయం 3.50 గంటలకు బల్హార్షాకు చేరుతుంది. అదేవిధంగా బల్హార్షాలో ఈ నెల 7వ తేదీన ఉదయం 3.50 గంటలకు బయలుదేరే బల్హార్షా-కాజీపేట (17036) ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు 8.50 గంటలకు చేరుతుంది. ఈఎక్స్‌ప్రెస్‌కు ఉప్పల్, జమ్మికుంట, ఓదెల, పెద్దపల్లి, రాఘవపురం, రామగుండం, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి, రెచ్నిరోడ్, సిర్పూర్‌కాగజ్‌నగర్, వీరూర్, వీర్గం, మణిఘర్ రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు కాజీపేట రైల్వేస్టేషన్ మేనేజర్ రవీందర్ తెలిపారు.

నాటి అజ్నీ ప్యాసింజరే నేటి ఎక్స్‌ప్రెస్‌గా..

గతంలో కాజీపేట-అజ్నీ-కాజీపేట మధ్య ప్రయాణించే ఈ ప్యాసింజర్‌ను కరోనా సమయంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు 2023, నవంబర్ 13వ తేదీన రద్దు చేశారు. దాదాపు 17 నెలల తర్వాత ప్రయాణికుల డిమాండ్ మేరకు ఈ అజ్నీ ప్యాసింజర్‌ను కాజీపేట-బల్హార్షా-కాజీ పేట మధ్య మెయిల్ డైలీ ఎక్స్‌ప్రెస్‌గా నడిపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చాలా కా లం తర్వాత ఈ రైలును ప్రవేశపెట్టడంతో కాజీ పేట నుంచి బల్హార్షా మార్గంలో వెళ్లే ప్రయాణికులు, ఇతర వర్గాల వారికి సౌకర్యంగా ఉంటుంది. కాగా, ఈ రైలును పునరుద్ధరించడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బీసీలకు సగం వాటా దక్కాల్సిందే

● కాళోజీ పురస్కార గ్రహీత డాక్టర్ రామా చంద్రమౌళి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్: జనాభాలో సగం ఉన్న బీసీలకు సగంవాటా దక్కాల్సిందే అని కాళోజీ పురస్కార గ్రహీత డాక్టర్ రామా చంద్రమౌళి అన్నారు. బుధవారం శాంతనగర్ నీలిమ నిలయంలో 'బీసీలు సగం.. బీసీలకు సగం వాటా'అనే శీర్షికతో ఆయన రచించిన బీసీల సిద్ధాంత గ్రంథం 'బీసీ మేనిఫెస్టో' పుస్తకాన్ని బీసీ మహాసభ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఉద్యమకారుడిగా, ఉద్యమాల ఉపాధ్యాయుడిగా సుపరిచితమైన సాంబశివరావు 78వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈపుస్తక ఆవిష్కరణ ఆయనకు నిజమైన ఘన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం నాయకులు పరికిపండ్ల అశోక్, పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్, క్యాన్సర్ ప్రత్యేక వైద్యనిపుణులు జనార్దన్, సీనియర్ డాక్టర్ ఆడెపు రాజేంద్రప్రసాద్, రామరాజు, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

మా బంగారం ఇవ్వండి..

ఎస్‌బీఐలో బాధితుల ఆందోళన

● చోరీకి గురైన బంగారం ఇవ్వాలని డిమాండ్
● లేదా ప్రస్తుతం గోల్డ్‌కు ఉన్న ధర ప్రకారం డబ్బు చెల్లించాలి
● తరుగు తీసి డబ్బు చెల్లిస్తామంటే తీసుకోబోమని స్పష్టీకరణ
● గత సంవత్సరం బ్యాంకులో 19 కిలోల పసిడి చోరీ
● పరిహారం ఇవ్వడానికి ఖాతాదారులను పిలిచిన అధికారులు


బ్యాంకు అధికారులను నిలదీస్తున్న బాధితులు

రాయపర్తి: చోరీకి గురైన బంగారం ఇవ్వండి.. లేదంటే ప్రస్తుతం మార్కెట్‌లో తులం గోల్డ్‌కు ఉన్న ధర ప్రకారం డబ్బు ఇవ్వాలి.. తరుగు తీసి డబ్బు చెల్లిస్తామంటే తీసుకోబోమని బంగారం బాధితులు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్‌బీఐలో ఆందోళన చేపట్టారు. కాగా, 2024 నవంబర్ 18న బ్యాంకులో 497 మందికి సంబంధించిన 19 కిలోల బంగారు ఆభరణాలను చోరీకి గురైన విషయం విధితమే. ఈ ఘటనలో బాధితులకు పరిహారం ఇవ్వడానికి అధికారులు.. బాధితులను బ్యాంకు పిలిపించారు. 'మీరు బ్యాంకులో దాచుకున్న బంగారం చోరీకి గురైంది.. ఈ కేసు కోర్టులో ఉంది. ప్రస్తుతం తులం బంగారానికి రూ.77,710 అందిస్తాం' అని చెప్పారు. దీంతో బాధితులు ససేమిరా అన్నారు. ప్రస్తుతం తులం బంగారం రూ. 87వేలు ఉందని, మేం పదితులాలకు తులం బంగారం తరుగు కోల్పోవాలా అంటూ నిలదీశారు. చోరీకి గురైన బంగారం ఇవ్వండి.. లేదా ప్రస్తుతం గోల్డ్‌కు ఉన్న ధర ప్రకారం డబ్బు ఇవ్వాలని, తరుగు తీయొద్దని డిమాండ్ చేశారు. దీంతో చేసేదేమీలేకపోవడంతో బ్యాంకు అధికారులు మరో వారం రోజుల తర్వాత రావాలని చెప్పడంతో బాధితులు వెనుదిరిగారు. కాగా, బ్యాంకులో భరోసా ఉంటుందని దాచుకుంటే అధికారుల నిర్లక్ష్యం వల్లే బంగారం చోరీకి గురైందని బాధితులు ఆరోపించారు. బ్యాంకుకు సెక్యూరిటీని నియమించకపోవడంతోనే చోరీ జరిగిందని మండిపడ్డారు. పరిహారం చెల్లించాలని నాలుగు నెలల నుంచి బ్యాంకు చుట్టు ప్రదక్షణలు చేస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

తులానికి గ్రాము తీసేస్తే ఎట్లా..



తులం బంగారానికి గ్రాము తరుగు తీసేసి డబ్బులు చెల్లిస్తామంటున్నారు. మాది మధ్యతరగతి కుటుంబం. మూడు తులాల తాడు చేయించుకోవాలంటే ఎంతో ఇబ్బంది. వాళ్ల డబ్బులు కట్టిస్తే ఎదో అప్పుకింద పోతుంది. ఆడపిల్లలకోసం బంగారు ఆభరణాలు చేయించుకున్నం. బ్యాంకుకు ఎంత వడ్డీ అయ్యిందో చెల్లిస్తాం. మా బంగారం మాకు ఇవ్వాలి.

-కోల హైమ, మైలారం

తరుగు తీసి డబ్బులు కట్టిస్తామంటున్నారు



అధికారుల నిర్లక్ష్యంతోనే బ్యాంకులో చోరీ జరిగింది. బంగారం పోయిన రోజు గుర్తుకూడా పోకుండా ఇస్తామని బాధితులకు చెప్పిన బ్యాంకు అధికారులు.. ఇప్పుడు బంగారంలో తరుగు తీసి డబ్బులు కట్టిస్తామంటున్నారు. పది తులాల బంగారానికి తులం లాస్ అవుతున్నాం. ఎంత మిత్తి అయ్యిందో అంత చెల్లిస్తం. మా బంగారం మాకు ఇప్పించాలి.

-పగిడిపల్లి భీంరెడ్డి, మైలారం

నాణ్యతాప్రమాణాలు లేని పాలు

● టెస్ట్ చెక్‌లో గుర్తించినట్లు వెల్లడి


పాల నాణ్యత చెక్ చేస్తున్న అధికారులు

వరంగల్: వరంగల్ పోచమ్మ మైదాన్‌లో హనుమకొండ విజయ డెయిరీలో 'పాల నాణ్యత'పై బుధవారం టెస్ట్ చెక్ నిర్వహించగా ప్యాకెట్లపై పేర్కొన్న విధంగా ప్రమాణాలు లేవని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ తెలిపారు. వినియోగదారుల మండలి సేకరించిన (19) ప్రైవేట్ డెయిరీల పాల నాణ్యతాపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పాల ప్యాకెట్‌లపై ముద్రించిన ప్రకారం వెన్న శాతం, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండడానికి కలిపే హైడ్రోజన్ పెరాక్సైడ్, కాస్టిక్ సోడాలకు సంబంధించిన నాణ్యతా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. విజయ డెయిరీ పోలికతో ఉన్న ప్రైవేట్ డెయిరీ పాలలో కాస్టిక్ సోడా కలిపినట్లు తేలిందన్నారు. అలాగే, ఆరు ప్రైవేట్ డెయిరీలు తమ ప్యాకెట్‌లపై ముద్రించిన ప్రకారం వెన్న శాతం పాలలో లేదని నిర్ధారణ అయ్యిందన్నారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మౌనిక, విజయ డెయిరీ డీడీ శ్రవణ్‌కుమార్, మేనేజర్ ప్రదీప్ ఆధ్వర్యంలో పాల నాణ్యతా పరీక్షలు జరిగాయి. కార్యక్రమంలో మండలి రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రావుల రంజిత్ కుమార్, నల్లా రాజేందర్, చిలువేరు ప్రవీణ్, నగర కార్యదర్శి బేతి రాజేశ్ పాల్గొన్నారు.

పెళ్లింట తీవ్ర విషాదం..

● కొడుకు పెళ్లైన రెండో రోజే బ్రెయిన్ స్ట్రోక్‌తో తండ్రి మృతి
● సుందరయ్య కాలనీ గ్రామంలో ఘటన


ఏసుబాబు(ఫైల్)


పెళ్లి సమయంలో కొడుకును ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు

వాజేడు : బంధువులు, అతిథుల మధ్య అంగరంగ వైభవంగా కొడుకు పెళ్లి జరిపించాడు. పెళ్లింటి నుంచి సొంతింటికి వచ్చి వ్రతం చేసుకుంటున్నారు. అంతలోనే బంధువులతో కళకళలాడుతున్న ఆ ఇంట తీవ్ర విషాదం చోటు చేసుకుంది. బ్రెయిన్ స్ట్రోక్‌తో పెళ్లి కొడుకు తండ్రి మృతి చెందాడు. ఈ ఘటనతో బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యులు, బంధువుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని సుందరయ్య కాలనీ గ్రామానికి చెందిన అక్కిసెట్టి ఏసుబాబు(48)కి భార్య కుమారి, ఇద్దరు కుమారులు హరికృష్ణ, శివ కృష్ణ ఉన్నారు. పెద్ద కొడుకు హరికృష్ణకు భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన యువతితో సోమవారం(మార్చి 3) పెళ్లి జరిపించాడు. అనంతరం వధూవరులను తీసుకుని తమ ఇంటికి వచ్చాడు. మంగళవారం సత్యనారాయణ స్వామి వ్రతం జరిపిస్తున్నాడు. అదే సమయంలో తనకు అలసటగా ఉందని, వ్రతంలో కూర్చో లేనని కుటుంబ సభ్యులకు తెలిపాడు. కొత్త జంటతో పాటు వరుడి తల్లి వ్రతంలో కూర్చున్నారు. ఈ క్రమంలో ఏసుబాబు కాళ్లు, చేతులు లాక్కురావడం చూసిన బంధువులు వెంటనే ఆర్‌ఎంపీతో పరీక్షించగా బీపీ పెరిగినట్లు తెలిపి వెంటనే మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలించాలని చెప్పాడు. దీంతో ఏటూరు నాగారం తీసుకు వెళ్లగా పరిస్థితి ప్రమాదకరంగా ఉందని వరంగల్ తీసుకెళ్లాలని అక్కడి ప్రైవేట్ వైద్యుడు తెలుపగా వెంటనే వరంగల్ ఎంజీఎం తరలించారు. వైద్యం చేస్తుండగా బుధవారం మృతి చెందాడు. దీంతో కుటుంబీకులు, బంధువులు బోరున విలపించారు.

ఇస్రో పిలుస్తోంది.. వెళ్దాం రండి

తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం

● యువికా కార్యక్రమానికి 23వ తేదీ వరకు గడువు
● 7 కేంద్రాల్లో నిర్వహణ
● ప్రయాణం, వసతి సౌకర్యాలు ఉచితం



మహబూబాబాద్ అర్బన్ : అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఏటా యువ విజ్ఞాన కార్యక్రమం(యువికా) నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది చేపట్టబోయే కార్యక్రమం కోసం దేశవ్యాప్తంగా తొమ్మిదో తరగతి విద్యార్థులను ఆహ్వానిస్తోంది. ఆ వివరాలు ఏమిటో ఒకసారి తెలుసుకుందాం.. అంతరిక్ష పరిశోధనల్లో ఇటీవల ఇస్రో వంద ప్రయోగాలు పూర్తి చేసుకుంది. అగ్రదేశాలకు దీటుగా భారత్ పరిశోధనలు చేపడుతోంది. ఈ విజ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజేసేందుకు, వారిలో స్ఫూర్తి నింపేందుకు ఇస్రో ఈ కార్యక్రమం చేపడుతోంది.

23వ తేదీ వరకు గడువు..

విద్యార్థులు మార్చి 23వ తేదీలోగా www.isro.gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తుల వడపోత అనంతరం ఏప్రిల్ 7న ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేస్తారు. మే 18 నుంచి విద్యార్థులను ఆహ్వానిస్తారు. మే 19 నుంచి 30 వరకు యువికా- 25 కార్యక్రమం నిర్వహిస్తారు. మే 31న ముగింపు సందర్భంగా కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు.

7 కేంద్రాల్లో నిర్వహణ

ఇస్రో ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో చేపడుతోంది. డెహ్రాడూన్(ఉత్తరాఖండ్), తిరువనంతపురం (కేరళ), సూళ్లూరుపేట (ఏపీ), బెంగళూరు (కర్ణాటక), అహ్మదాబాద్(గుజరాత్), హైదరాబాద్(తెలంగాణ), షిల్లాంగ్(మేఘాలయ).

అన్నీ ఉచితంగానే..

ఇస్రో నిర్వహించే యువికా కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు ప్రయాణం, భోజన, వసతి సౌకర్యాలు ఇస్రో ఉచితంగా అందజేస్తుంది. ఎంపికైన విద్యార్థులను మే నెలలో 14 రోజులపాటు ఇస్రోకు చెందిన స్పే సెంటర్లకు తీసుకెళ్తారు. అక్కడ సైన్స్‌కు సంబంధించిన వింతలు, విశేషాలు, సప్త గ్రహ కూటమి తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం విద్యార్థులకు కల్పిస్తారు.

ఎవరు అర్హులు..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇస్తారు. స్పేస్, సైన్స్ క్లబ్‌లో ఉంటే 5 శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపితే 10 శాతం, ఎన్సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాల్లో ఉంటే 5 శాతం, పల్లె ప్రాంతాలకు చెందిన వారికి 20 శాతం ప్రాధాన్యం కల్పిస్తారు.

నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

● రూ.34 లక్షల విలువైన మందులు, రెండు కార్లు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిశోర్ ఝా


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా, పోలీసు అధికారులు

రామన్నపేట : అన్నదాతలను మోసం చేస్తూ నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు. వీరి నుంచి సుమారు రూ.34 లక్షల విలువైన వివిధ కంపెనీల పేర్లతో ఉన్న నకిలీ పురుగు మందులు, రెండు కార్లు, ఐదు సెల్‌ఫోన్లు, నకిలీ పురుగు మందు లేబుళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రెండు రోజుల క్రితం టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా వరంగల్ గోపాలస్వామి గుడి ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. దీంతో తనిఖీ చేయగా పురుగు మందుల డబ్బాలు కనిపించాయి. కారులో ఉన్న నిందితుల్లో ఒకరైన కర్ణాటకలోని బళ్లారి జిల్లా కురుగోడుకు చెందిన నిందితుడు కాట్రగౌడ భాస్కర్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించగా నకిలీ పురుగు మందులను విక్రయిస్తున్నట్లు అంగీకరించడంతో మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం విచారణలో భాగంగా మంగళవారం నిందితుడు కాట్రగౌడ భాస్కర్ రెడ్డి సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా హైదరాబాద్ చర్లపల్లి ప్రాంతంలోని గోడౌన్‌పై దాడి చేసి మిగతా నలుగురు నిందితులు హైదరాబాద్ కుషాయిగూకు చెందిన పిల్ల నాగవెంకటరంగారావు, లక్డీకాపూల్‌కు చెందిన ముద్దంగుల ఆదిత్య, దూదిమెట్లకు చెందిన పిట్ల నవీన్, మిర్యాలగూడ ఇందిరమ్మకాలనీకి చెందిన దూదిమెట్ల శ్రీధర్‌ను విచారించారు. డిమాండ్ ఉన్న కంపెనీ పేర్లతో నకిలీ పురుగు, గడ్డి మందులు తయారీ చేసి విక్రయించి రైతులను మోసం చేస్తున్నట్లు అంగీకరించారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి బేయర్, టాటా, కోర్టెవాతోపాటు మరో నాలుగు కంపెనీల పేర్లతో ఉన్న నకిలీ పురుగు మందులు, గడ్డి మందులు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు. కాగా, నిందితులను పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, టాస్క్‌ఫోర్, వరంగల్ ఏసీపీలు మధుసూదన్, నందిరాంనాయక్, టాస్క్‌ఫోర్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు సార్ల రాజు, గోపి, ఎస్సైలు ఓరుగంటి భానుప్రకాశ్, లచ్చయ్య, సాంబయ్య, ఏఏఓ సల్మాన్ పాషా, కానిస్టేబుళ్లు సురేశ్, సాంబరాజు, సురేందర్, రమేశ్‌ను సీపీ అభినందించారు.

షేర్ హోల్డర్స్‌కు ఫెస్టివల్ లోన్

● హోలీ,ఉగాది, రంజాన్ పండుగలకు రూ. లక్ష మంజూరు

కాజీపేట రూరల్ : దక్షిణ మధ్య రైల్వే రైల్వే ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (ఈసీసీఎస్) లిమిటెడ్.. హోలీ, ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా రైల్వే సీసీఎస్ షేర్ హోల్డర్స్(సభ్యులు)కు రుణాల మంజూరు ప్రకటించిందని కాజీపేట రైల్వే సీసీఎస్ డైరెక్టర్ డి.శ్రీనివాస్ యాదవ్, కోఆప్షన్ డైరెక్టర్ దేవులపల్లి రాఘవేందర్ బుధవారం తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రెసిడెంట్ చిలుకు స్వామి, వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్ నేతృత్వంలో సీసీఎస్ సభ్యులకు ఫెస్టివల్ లోన్ ఇచ్చేందుకు బోర్డు నిర్ణయించినట్లు తెలిపారు. అర్హులైన రైల్వే సీసీఎస్ సభ్యులు ఈ ఫెస్టివల్ లోన్‌కు ఈ నెల 6వ నుంచి 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫెస్టివల్ లోన్‌గా సీసీఎస్ సభ్యులకు రూ. లక్ష మంజూరు చేయనున్నట్లు వారు తెలిపారు.

టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి అభినందనలు



శ్రీపాల్‌రెడ్డిని అభినందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు


రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న టీచర్ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన పింగిళి శ్రీపాల్‌రెడ్డిని పీఆర్‌టీయూ వివిధ మండల శాఖల, జిల్లా బాధ్యులు, ఇతర సంఘాల బాధ్యులు బుధవారం సాయంత్రం హనుమకొండలోని పీఆర్‌టీయూ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. శాలువాలు కప్పి పూలబొకేలు అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఈ. శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు కళాశాలల అధ్యాపకులు శ్రీపాల్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛ అందించారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, శ్రీధర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

వేములవాడ: రాజన్నను నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి గెలుపొందిన పింగిళి శ్రీపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, ఉద్యోగులకు రావాల్సిన 5 డీఏలు, ఉపాధ్యాయుల సర్వీస్‌రూల్స్ సాధించేందుకు పోరాడుతానన్నారు.

డీఎన్ఏ.. వ్యక్తిగత జీవితానికి ఆధారం

● కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి


మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్: డీఎన్ఏ.. వ్యక్తిగత జీవితానికి ఆధారమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కేయూలోని జువాలజీ విభాగం ఆధ్వర్యంలో 'యూసెస్ ఆఫ్ రీకాంబినెంట్ డీఎన్ఏ టెక్నాలజీ ఇన్ హెల్త్' అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ ప్రారంభ సభలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్న మాలిక్యూల్ వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాదు దేశాల ఆర్థిక వ్యవస్థను కూడా మార్చుతుందన్నారు. వ్యాధుల నివారణ, చికిత్సల్లో అపరిమితమైన ఆవశ్యకత ఉందన్నారు. కోవిడ్-19 సమయంలో డీఎన్ఏ ప్రధాన భూమిక వహించిందన్నారు. రోగ నిరోధక వ్యవస్థ , యాంటీబాడీల అభివృద్ధిలో కరోనా సమయంలో వ్యాక్సిన్‌ల ప్రాధాన్యతను గుర్తుచేశారు. భారతదేశం వ్యాక్సిన్ల హబ్‌గా నిలిచిందన్నారు. పబ్లిక్‌హెల్త్‌లో వ్యాక్సిన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. దేశీయంగా వ్యాక్సిన్ల ఉత్పత్తితో వ్యయం తగ్గుతుందన్నారు. ఆ దిశగానే పరిశోధనలు కొనసాగించాలన్నారు. సమావేశంలో జువాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ జి. షమిత, సైన్స్ విభాగాల డీన్ జి. హనుమంతు, ఆచార్యులు మామిడాల ఇస్తారి, వై. వెంకయ్య, ఈసం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

121 డిగ్రీ కళాశాలల ఫలితాలు నిలిపివేత

● కేయూ డీన్ అకడమిక్‌కు ఫీజులు చెల్లించని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు
● నోటీసులకు యాజమాన్యాల నో రెస్పాన్స్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ బీఎస్సీ, బీసీఏ బీ ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను ఈ నెల 4న రాత్రి విడుదల చేసిన విషయం తెలిసిందే. కానీ డీన్ అకడమిక్‌కు ఫీజులు చెల్లించకపోవడంతో ఆయా కళాశాలల పరీక్షల ఫలితాలను , యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారులు నిలిపివేశారు. యూనివర్సిటీ పరిధిలో 304 (ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ గురుకుల) కళాశాలలు ఉన్నాయి. అందులో 121 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు యూనివర్సిటీ డీన్ అకడమిక్‌కు వివిధ రకాల ఫీజులు చెల్లించాల్సింటుంది. కానీ, ఫీజులు చెల్లించకపోవడంతో వాటి ఫలితాలను యూనివర్సిటీ పరీక్షల విభాగం అధికారులు నిలిపివేశారు. దీంతో విద్యార్థులకు ఫలితాలు తెలియక ఆందోళన చెందుతున్నారు. కొన్ని కాలేజీలకు వచ్చి మరికొన్నింటికి రాకపోవడేమంటని ఆరా తీస్తున్నారు.

ఇప్పటికే సమయమిచ్చిన వర్సిటీ అధికారులు

కాకతీయ యూనివర్సిటీ డీన్ అకడమిక్‌కు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రాసెసింగ్, స్టూడెంట్ రికగ్నిషన్ ఫీజు, స్టూడెంట్ వెల్ఫేర్ ఫండ్, ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ ఫీజు కలిపి చెల్లించాల్సింటుంది. విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా ఫీజులు కట్టాల్సి ఉంటుంది. విద్యార్థులు ఎక్కువమంది ఉన్న కళాశాలలు రూ.లక్షల్లోనే చెల్లించాల్సింటుంది. డిగ్రీకోర్సుల మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు గత ఏడాది డిసెంబర్‌లో మొదలయ్యే సమయంలో ఆయా ఫీజులు చెల్లించాల్సిండగా, అప్పట్లో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్‌ల బాధ్యులు కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డిని, అప్పటి రిజిస్ట్రార్ మల్లారెడ్డిని కలిశారు. తమ కళాశాలలకు ప్రభుత్వం రెండుమూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంలేదని, ఆర్థిక ఇబ్బందులున్నాయని, ఫీజులు చెల్లించేందుకు కొంత సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఇందుకు తొలుత అంగీకరించకపోయినా ఆ తర్వాత తప్పని పరిస్థితుల్లో వీసీ, రిజిస్ట్రార్ అంగీకరించారు. 15 నుంచి 20 రోజుల వరకు సమయం ఇచ్చారు. పరీక్షలు పూర్తయ్యాక కూడా కొద్దిరోజుల క్రితం జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తికావొచ్చినప్పుడు యూనివర్సిటీ అకడమిక్ డీన్ ఆయా కళాశాలలకు ఫీజులు చెల్లించాలని నోటీసులు పంపారు. కొన్నికళాశాలల యాజమాన్యాలు చెల్లించగా, 121 ప్రైవేట్ కళాశాలలు బుధవారం వరకు ఫీజులు చెల్లించలేదు. ఫీజులు చెల్లించిన వాటి ఫలితాలు వెబ్‌సైట్ ఉంచి, చెల్లించని వారివి నిలిపివేశారు.

ఆందోళన చెందుతున్న విద్యార్థులు

తమ ఫలితాలు చూసుకునే వీలులేకపోవడంతో ఆయా కళాశాలల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కళాశాలలకు వెళ్లి ఫలితాలు కనిపించడం లేదని ప్రశ్నించినట్లు సమాచారం . కాగా, తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ ప్రైవేట్ కళాశాలల యాజామాన్యాల అసోసియేషన్ బాధ్యులు బుధవారం రిజిస్ట్రార్ రామచంద్రాన్ని కలిసి.. ఫలితాలు వెల్లడించాలని విన్నవించారు. తాను వీసీ దృష్టికి తీసుకెళ్లాక నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారని సమాచారం.

ఫీజులు చెల్లిస్తేనే ఫలితాలు

కాకతీయ యూనివర్సిటీ డీన్ అకడమిక్‌కు ఫీజులు చెల్లించినట్లు క్లియరెన్స్ వస్తేనే ఫలితాలు వెల్లడిస్తాం . ఫీజులు చెల్లించకపోతే ఫలితాలను వెల్లడించే ప్రసక్తి లేదు.

- ప్రొఫెసర్ రాజేందర్,
పరీక్షల నియంత్రణాధికారి, కేయూ